

# శ్రీ వేంకటేశ శతకము

హారిణి (దుద్యాల) చొప్పకట్ల

DRAFT COPY

# శ్రీ వేంకటేశ శతకము

1. శ్రీ మనోహర శ్రీపతీ సిరినివాస
శతకరచనకు బూనుచు శరణు వేడ
మార్గదర్శియై నుడుపుమా మమత జూపి
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

2. నిత్య సృజనము జేయను ముత్యమంటి
పలుకులిడమని దెలుపుమా బ్రహ్మసతికి
సౌరభమ్మును జిమ్ముచూ శతకమలర
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

3. శేషశాయినే యచ్యుతా శ్రీనివాస
దీనబాంధవా శ్రీధరా దానవారి
నన్ను గావుమా సదయత నయముగాను
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

4. తలుతు వాలాయము నినునే తనివిదీర
కొలుతు ధీరమ్య గుణసాంద్ర కోరి నిన్ను
యేలుము నను నీ బంటుగ యేలికగుచు
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

DRAFT COPY

5. కవుల నెలవు నీవని నమ్మి కవితలల్ల
పయనమైతిని మాధవా భక్తితోడ
భావదారిద్ర్యమును దీర్చి పటిమనిడుమ
వెంగమాంబకు ప్రాణమా వేంకటేశ !!

6. వేల్పులెల్లరు గొలిచెడి వేదమూర్తి
యాపదలను తొలగజేయు నపరశక్తి
భక్త జనులను బ్రోవుమా పరమపూజ్య
వెంగమాంబకు ప్రాణమా వేంకటేశ !!

7. లక్ష్మి సహితము నలరుచు లక్షణముగ
వెతలు దీర్చెడి కలియుగ వేల్పువగుచు
యభయము నొసంగుచు నడుపు యభయహస్త
వెంగమాంబకు ప్రాణమా వేంకటేశ !!

8. వేయి జన్మల ఫలముచే వెంగమాంబ
వంశ కుసుమముల్ వనమందు పరిమళించి
నీదు శుశ్రూష జేయంగ నిలచితయ్య
వెంగమాంబకు ప్రాణమా వేంకటేశ !!

DRAFT COPY

9. యనుచు గోవింద గోవింద యార్తితోడ
భక్త జనులెల్ల నిను నమ్మి పరవశమున
సప్తగిరుల నారోహించ సాంత్వనిడుమ
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

10. ప్రాణముగ నీవు కొలువున్న పావనమగు
యాలయముగ నిల్చు దనువు యవనియందు
నీవు వీడంగ కుణపమై నేలకొరుగు
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

11. జన్మలందున మరుజన్మ చక్కనిదగు
జన్మ నిడుమని గొనియాడ జాడదెలిపి
జన్మరాహిత్య మిడుమయ్య జనకుడగుచు
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

12. ఆర్తి తోడను వేడెద యాత్మశయన
యిహము వీడు ఘడియ వరకు నీప్సితముగ
నిన్ను గీర్తించు భాగ్యమ్మునిమ్ము తండ్రి
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

DRAFT COPY

13. యోగులెల్లరు కొనియాడు యోగపురుష
సాలగ్రామ నివాసినే శాంతరూప
యందుకో పద్యకుసుమముల్  నాదరించి
వెంగమాంబకు ప్రాణమౌ  వేంకటేశ !!

14. అఖిల మంత్రములిమిడి యద్భుతముగ
నీదు దివ్యనామము నందు నిత్యమలరు
యట్టి నామమున్ స్మరియింప యభయమిడుమ
వెంగమాంబకు ప్రాణమౌ  వేంకటేశ !!

15. ప్రసువు గోవును గాంచక వగచునట్టి
చిట్టి తువ్వాయి వోలెను చింతనొంది
నీదు దర్శనమును గోరి నిలచియుంటి
వెంగమాంబకు ప్రాణమౌ  వేంకటేశ !!

## దశావతారములు

16. మందరగిరి వహించుచు మంథనమున
కూర్మ రూపము ధరియించి కొలువు దీరి
సురుల నెరవుగ నిలిచిన శోభ వీవు

DRAFT COPY

17. మత్స్యరూపమున్ ధరియించి మనువు కొరకు
ప్రళయకాలము నందున ప్రాణములిడి
వేదములను రక్షించిన వెలదివీవు
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

18. వేదముల నపహరణంబు విధిగజేయు
దివ్య మీనాకృతిన్ దాల్చి దీప్తులిడుచు
సోముఖుని సంహరించిన సొబగు నీవు
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

19. ధరణిమూర్తిని వేదింప దానవుండు
యజ్ఞ వారాహ మూర్తిగాయవతరించి
జవురితివి హిరణ్యాక్షుని జగతి కొరకు
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

20. నీదుషితమును బ్రశ్నింప నెళవు మరచి
పలువిధముల ప్రహ్లాదుకిన్ వగపునిడగ
నారసింహుడై యసురిని నణచినావు
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

(ఉషితము: ఉనికి, నివాసము)

DRAFT COPY

21. బాలినణచుటకరుదెంచి వటువుగాను
మూడడుగులచే గాచియు ముజ్జగములు
కాశ్యపిని గడదేర్చిన కల్కి వీవు
వెంగమాంబకు ప్రాణమౌ  వేంకటేశ !!

22. మౌని జమదగ్ని సుతునిగా మర్త్యమందు
పరశుధరుడవై యేతెంచి పరమపురుష
భూపతుల దునుమాడిన భువన శ్రేష్ట
వెంగమాంబకు ప్రాణమౌ  వేంకటేశ !!

23. దశరథసుతగ వెలుగొంది ధరణియందు
దైత్య సంహారమును సలిపిధరణినేలి
ధర్మ రక్షణ పఱపిన ధర్మమీవు
వెంగమాంబకు ప్రాణమౌ  వేంకటేశ !!

24. అష్టమితిథిని జనియించి యవనియందు
కృష్ణ రూపమున్ మమ్మేలి తృష్ణదీర్చి
కంసవధను సలిపినట్టి కరుణ నీవు
వెంగమాంబకు ప్రాణమౌ  వేంకటేశ !!

DRAFT COPY

25. భవ్య సిద్ధార్ధగాబుట్టి దేవ నీవు
బుద్ధుడవగుచు బౌద్ధంబు బోధజేసి
జీవహింసను మాపిన జియ్యవీవు
వెంగమాంబకు ప్రాణమా వేంకటేశ !!
(జియ్య: దేవుడు)

26. కలియుగాంతమున్ గలిమాయ గప్పుమమ్ము
ధర్మ సిద్ధులు క్షీణించి దైత్య మలర
ఖడ్గధరుడవై నరుదెంచు కల్కివీవు
వెంగమాంబకు ప్రాణమా వేంకటేశ !!

27. కలము కలశము జేసియు కావ్యమలర
భావద్రవ్యముల్ నింపియు పావనముగ
వ్రతము సలిపెద సతతము వాక్కుతోడ
వెంగమాంబకు ప్రాణమా వేంకటేశ !!

28. సప్తధాతువులను జేసి సప్తగిరులు
మదిని జేసెద మంగళమందిరమ్ము
హరిణి నిలయ వాసివగుమ గిరులవాస
వెంగమాంబకు ప్రాణమా వేంకటేశ !!

DRAFT COPY

29\. వెంగమాంబయె గొలిచిన విధము నీకు

పరవశమున నుతులు జేసి ప్రతిదినమ్ము

దివ్య నైవేద్యమునిడెద దేవ నీకు

వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

30\. అబ్ర నిర్మలాకృతియందు హయముఖునిగ

దైత్యసంహారమున్ సలిపి తగినరీతి

వేదములనెల్ల గాచిన విద్యరూప

వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

31\. ఇరువురమ్మల మనముల ఏలికగుచు

చిరునగవులతోడ జనుల చింతదీర్చి

నిత్యము నిను దర్శించెడి నిధి నిడువుమ

వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

32\. కోరను భవసుఖములను గోరనయ్య

భోగభాగ్యముల్ కీర్తిని భువిని నేను

గోరెదను నీపదములను గోరెదనిను

వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

DRAFT COPY

33. జాడ దెలియక నిలచితి సంకులమున
అస్తవ్యస్తమగు జగమున్ హాయిలేక
నిన్ను గాంచగ పొందితి నిమ్మళమును
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

34. కలిపురుషుని ఛాయలలర కలియుగమున
కలక బారెను లడ్డూలు కలతనిడుచు
పాపులకు శిక్ష నిడుమయ్య పరమరూప
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

35. మోదమున నిను గాంచుచు మోహనాంగ
సత్కవిత్వ భాషణములు సతము సలిపి
శ్రీసతి సమేతముగ నీదు సేవజేతు
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

36. భామలిరువురి నడుమను పరవశమున
చిరునగవులతోడను నిల్చి చేతనమున
సకల సేవలు జేకొను శక్తిరూప
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

DRAFT COPY

37. వానరమగు నామది భక్తి వలదు యనెను
ఇంద్రియమ్ముల బంధించె నిహము నందు
తలపు నీమీద నిలిపెడి దారిజూపు
వెంగమాంబకు ప్రాణమౌ  వేంకటేశ !!

38. సుమధురమగు మోహనరూప సుముఖివీవు
నిగమ నిగమాంతసారముల్ నిలయమీవు
వేంకటాద్రి నందలరెడి వెలదివీవు
వెంగమాంబకు ప్రాణమౌ  వేంకటేశ !!

39. మందిమతినౌచు జేసిన మ్రుందిపోవు
రాజి లెక్కింపకుము దేవ లలితనేత్ర
నిపుణమతిని జేయుము దేవ నెనరు జూపి
వెంగమాంబకు ప్రాణమౌ  వేంకటేశ !!

**<u>ఆళ్వారుల చరితలు</u>**

40. ఆయుధములెల్ల పయనమై యవనియందు
భక్తి మార్గమున్ భోదింప యుక్తముగను
యలవి యాళ్వార్లుగజనిరి వెలుగులిడుచు
వెంగమాంబకు ప్రాణమౌ  వేంకటేశ !!
(అలవి: శక్తి)

DRAFT COPY

41. ద్రవిడ సాహిత్యమున్ నేర్పి ధరణి యందు
యారు రిపువులన్ జనులందు నణచివైచి
ధర్మపథమున దెలిపిరి మర్మములను
వెంగమాంబకు ప్రాణమౌ  వేంకటేశ !!

42. నాల్గువేల కీర్తనములు నందముగను
గనప నాలాయిరమనెడి కావ్యముగను
రచన జేసి భోదించిరి రంజితముగ
వెంగమాంబకు ప్రాణమౌ  వేంకటేశ !!
(పొయగై/ పొయిఘ ఆళ్వార్)

43. "పొయిఘ" యాళ్వారుగ వెలసె పుడమియందు
పాంచజన్యమ్ము లిఖియింప పాశురములు
నిన్ను స్తుతియించి తారియించె నిరతితోడ
వెంగమాంబకు ప్రాణమౌ  వేంకటేశ !!
(పూదత్తు ఆళ్వారు)

44. దివ్య పూదత్తునిగడరె దేహముగొని
నీదు కౌమోదకము దేవ మోదముగను
నీదు గుణకీర్తి జేసెను నెనరు జూపి
వెంగమాంబకు ప్రాణమౌ  వేంకటేశ !!
(కులశేఖర ఆళ్వారు)

DRAFT COPY

45. కౌస్తుభమవతరించెను కలియుగమున
దివ్య శుష్కమ్ము తోడను దీప్తులిడుచు
శ్రవణ మార్గము తొడరుచు సమకొనెనిను
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

(తొడరుచు : అనుసరించు)

46. భవ్య కులశేఖర పడిగ పరవశమున
నిన్ను గాంచు సిద్ధినిబొంది నీదు దరిని
నిలచె ముదమున నిరతము నెనరుతోడ
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

(పేయాళ్వార్)

47. నందముగ జనియించెను నందకమ్ము
నీదు చరితమ్ము లిఖియింప మోదముగను
పాశురములు వ్రాసెను పలు భవ్యరీతి
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

48. శూరుడగు సుదర్శనమిలను శోభతోడ
జనన మొందె బాలకునిగ జగతియందు
పరమ మార్గమ్ము కఱపించె భక్తితోడ
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ !!

(కఱపించు: బోధించు)

DRAFT COPY

49. అట్ర శ్రీవిల్లి పుత్తూరు యనెడి పురము
నందు గరుడుడు జనియించె నవ్యముగను
నీదు కైంకర్యముల్జేయ నెమ్మితోడ
వెంగమాంబకు ప్రాణమౌ  వేంకటేశ !!

(గోదాదేవి)

50. లలిత లావణ్యములతోడ రమ్యముగను
ధరణిజ వెలసె “గోద”యై ధరణియందు
సతము నినుజేర యత్నించి సలిపె సేవ
వెంగమాంబకు ప్రాణమౌ  వేంకటేశ !!

(విప్రనారాయణుడు/తొండరిప్పొడి ఆళ్వార్)

51. భవ్య శ్రీరంగమందున బాలునివలె
వెలసి నినుగొల్చి సతతము వేల్పువనుచు
నిన్ను జేరెను ముదమున నిర్మలముగ
వెంగమాంబకు ప్రాణమౌ  వేంకటేశ !!

(శ్రీవత్సం అంశ/తిరుప్పాణి ఆళ్వార్)

52. యోగ్య హరిదాసుగా బుట్టి యుక్తముగను
పాశురములతో ప్రణుతించి పరవశమున
పరమగుగతిని  బొందెను భాగ్యముగను
వెంగమాంబకు ప్రాణమౌ  వేంకటేశ !!

(విస్వక్సేనుడు/నమ్మాళ్వార్)

కలియుగము మొదలైన 47వ రోజు జనియించారు.

DRAFT COPY

53. వేదసారమున్ లిఖియించి విశదముగను
ద్రవిడసాహిత్యమందున తగినరీతి
నిలిచె శటకోపిగ సతము నెళవు నెరిగి
వెంగమాంబకు ప్రాణమౌ  వేంకటేశ !!

54. (కుముదము యొక్క అంశ/మధురకవి)
తిరువిరుత్తం: ఋగ్వేదం
తిరువాశిరియం: యజుర్వేదం
తిరువాయిమొళి: సామవేదం
పెరియతిరువందాది: అధర్వణవేదం
పరమ భక్తుడౌ జనియించి పావనమగు
నమ్మయాళ్వారు నీదరి నందముగను
సతము లిఖియించె వేదముల్ సంతసమున
వెంగమాంబకు ప్రాణమౌ  వేంకటేశ !!

55. పద్మపీటము నందున పద్మనాభ
పద్మతోడను దీపిల్ల పంచమముగ
పాద పంకేరుహములకున్ ప్రాంజలిడెద
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

DRAFT COPY

56. కులము మతమైన నీవె నా కలిమి నీవు
తలపు వలపైన నీవెనా నెలవు నీవు
తనువు తపనైన నీవె నా మనము నీవు
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

57. తిరము దివ్యమౌ దీపిల్లు తిరుమలగిరి
తిరము భక్తులన్ బ్రోవుచు వరమొసగెడి
యభయహస్తంబుగా నిల్చి విభవమైన
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

58. సిరుల గోరక నిత్యమ్ము సేవ జేతు
వరములడుగక సతతము ప్రాంజలిడెద
సత్వలుకులనిడి బ్రోవుమా శాస్త్రరూప
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

59. వరద వనజాక్ష విశ్వేశ వైరిహరణ
వాసుదేవ విధిస్తుత్య భక్తవరద
లక్ష్మితోడను గావుమా రక్షనిడుచు
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

DRAFT COPY

60. విమలసత్కృప భూషణ విష్ణువీవు
నిఖిల భక్తజనావళి నెలవు నీవు
నన్ను నిరతము నడిపెడి నాథుడీవు
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

61. నీదు దరిసెనమే కడు మోదమనుచు
వేచిజూచినట్టి శబరి వెతనుదీర్చి
ఎంగిలిని ముదమునగొని యెలమినిడిన
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

62. ఆది మధ్యాంతరహిత! అనంతరూప
విశ్వవ్యాపియైనట్టియో విష్ణురూప
విస్వకల్యాన సంధాత వేదరూప
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

63. దివ్యదేశములుగ వెల్గు భవ్యరీతి
నీదు తీర్థరాజములెల్ల మోదమిడుచు
ధరను మోక్షమోసంగెడి ధామములుగ
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

DRAFT COPY

64. పద్యకవిగ నే సతతముపలువిధముల
అక్షరములతోడ నిడుచు యర్చనములు
యొనరగాత్మనివేదన నందుకొనుమ
వెంగమాంబకు ప్రాణమా వేంకటేశ!!

65. శ్రవణ, కీర్తన, అర్చన, స్మరణములచె
పాదసేవన సఖ్యము వందనముల
దాస్యమను నవవిధముల గొల్తు తపనతోడ
వెంగమాంబకు ప్రాణమా వేంకటేశ!!

66. దేవకీగర్భ సంభూత దివ్యతేజ
భవ్యగోవర్ధనోద్ధార పాపనాశ
సకలజీవాత్మ శుష్మమా శరణుశరణు
వెంగమాంబకు ప్రాణమా వేంకటేశ!!

67. సద్గుణంబుల నిధిధామ సంతతమ్ము
నీగుణంబుల దలచుచు నిరతితోడ
చామరమ్మును వీచెద సవినయముగ
వెంగమాంబకు ప్రాణమా వేంకటేశ!!

68. షోడశ యుపచారమ్ముల చోక్షముగను
నిరతము సలిపెదను దేవ నియతి మీర
సత్కృపను జూపు నినువేడ శరణుయనుచు

వెంగమాంబకు ప్రాణమా వేంకటేశ!!

69. పరమ తీర్థరాజి నిలచు పాదములకు

బ్రహ్మ నిత్యము గడిగెడి పాదములకు

స్వర్గమైనను నిలువదు సాటిగాను

వెంగమాంబకు ప్రాణమా వేంకటేశ!!

70. వేయినామాల దైవమా వినతులివియె

వేయిరూపాల శుష్కమా వెతలు దీర్చి

భక్తజనులను బ్రోవుమా భవవినాశ

వెంగమాంబకు ప్రాణమా వేంకటేశ!!

71. పలికెదను నీ చరితమును పరవశమున

పలికెదను వేయి నామముల్ ప్రాంజలిడుచు

పలికెదను వీర గాథలు వరమనుచును

వెంగమాంబకు ప్రాణమా వేంకటేశ!!

73. మరువ యింద్రియా నందమున్ వరము నిడుమ

మరువ యైహిక బంధముల్ మరపునిడుమ

మరువక సతము నినుగొల్వ వరమునిడుమ

వెంగమాంబకు ప్రాణమా వేంకటేశ!!

74. వేంకటాచల మహిమంబు వినిన గనిన

సకల కామ్యముల్ సిద్ధించి సౌఖ్యముల్

కరుణతోడ నొసంగెడి గరుడగమన

DRAFT COPY

వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

75. తూకొనెను మోక్ష వాంఛతో తుంబురుండు
దివ్యమౌ రీతి వెల్గుయా తీర్థమందు
నీదు తపమున్ సలిపి జేరె నిన్ను తుదకు
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

76. భవ్య తుంబుర తీర్థంబు పావనమని
ప్రీతితోడను నిలచియు వెంగమాంబ
జీవ యవసాన దశయందు జేరెనిన్ను
వెంగమాం బకు ప్రాణమౌ వేంకటేశ!!

77. దివ్య ఫాల్గుణ పౌర్ణమి తిథినిగలుగు
తీర్థ దర్శనంబొక యోగ్య తేవరీతి
పరవశంబున నిలుతురు భక్తజనులు
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!
(తేవ : ఉత్సవము)

78. శాస్త్రసారమున్ గ్రహియింప శక్తి లేదు
వేదసారమున్ పటియింప విధులు రావు
నామస్మరణము సలుపగ నన్ను గనుమ
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!
(బ్రహ్మోత్సవములు)

79. బ్రహ్మసహితము సురులెల్ల పరవశమున



DRAFT COPY

యుత్సవంబును సలిపిరి యోగ్యముగను
యడరె తిరువీధులన్నియు యద్భుతముగ
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

80. తొలుత బ్రహ్మ సలిపినట్టి తోయమందు
దివ్య బ్రహ్మోత్సవమ్ములు తిరుమలందు
సలిపెదరు ముదమున నీకు శాస్త్రరీతి
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!
(తిరుమల సేవలు)

81. సుప్రభాతము నందున శుభముగోరి
పాడెదరు మేలుకొలుపులు భక్తి మెఱయ
కుంచకోల తాళమునందు కోర్కెమీఱ
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

82. భవ్య నిజపాద దర్శనభావనమును
తీయని పదమ్ములు బలికి తెలుప తరమ
మదిని నెలకొన్న యనుభూతి మరువ తరమ
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

DRAFT COPY

83. అఖిల మౌనివర్యులకెల్ల యభయమొసగు
భక్త జనులను బ్రోవుచు పరమునొసగు
నీదు చరణంబె శరణంబు నిక్కమిదియె
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

84. సుప్రభాతసేవ పిదప శుద్ధి సలుప
బూనెదరర్చకులెల్లరు పొసగురీతి
నీదు నిర్మాల్యశోధనే మోదమనుచు
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!
(పొసగు:ఒప్పగు)

85.అర్చనమును సలుపుటకై యద్భుతముగ
పుణ్య "అయుత్తయుర్రై" నుండి పుష్పములను
సుప్రభాతమున్ గొనివచ్చి శోభ గూర్చి
పరవశమ్మును బొందెదరయ్య ప్రతిదినమ్ము
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

86. పుష్పమాలికల్ గొనివచ్చి పుష్టితోడ
నీదు హవణింపు సలిపియున్ నెనరుతోడ
ఊర్ధ్వ పుండ్రముల్ దిద్దేరు యుక్తముగను
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

87. శ్రేష్ఠ సొబగుల తోమాల సేవ పిదప
మాన్య "తిరుమామణి" యనెడి మంటపమున
కొలువుదీరి దర్బారున వెలుగులిడుచు
విషయములను ముదమ్మున వినెదవయ్య
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

88. వేయినామాలతోడను వినుతిజేసి
తులసిదళములు గొనివచ్చి తుష్టితోడ
నీదు దేవేరుల కొసంగి నిగరముగను
అభ్ర నక్షత్ర కర్పూర హారతులను
సకల మంత్ర పఠన శాస్త్ర సహితముగను
యింపుగా నిడెదరు కడు యీప్సితముగ
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

89. గణగణ మనుచు మ్రోగించి గంటలన్ని
యన్న నైవేద్యములనెల్ల నారగింప
నిష్ఠతోడ ప్రతిదినమ్ము నిడెదరయ్య
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

DRAFT COPY

90. అడరు మలయప్ప స్వామివౌ నారజమున
యిరువురమ్మలన్ గూడియు విభవముగను
వేయి దీపికల నడుమ హాయి గూర్చి
గాన ఊయలలూగగ గాంచ నిన్ను
బ్రతుకు ధన్యమౌ నిలలోన పరవశమున
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

91. (ఏకాంత సేవ)
భక్త జనులెల్ల సేయగా బహువిధముల
విన్నపములను వినినంత వెతలు దీర్చి
యలుపు నొందిన నినుజేరి యట్రీతి
శయన సేవ సలిపెదరు శక్తి మీర
తాళ్ళపాక లాలనతోడ తన్మయమున
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

92. పంజరము నుండి వెడలిన పక్షివోలె
నిన్ను గన్న క్షణమున నెరుగకేమి
సంతసమ్మున నీలోన సమసిపోదు
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

DRAFT COPY

93. కష్టములను వలయ మందున కనని వినని
రీతి జిక్కిన భక్తుల భీతులన్ని
దొలగ జేయుమా దయజూపి కలిమిగూర్చి
వెంగమాంబకు ప్రాణమా వేంకటేశ!!

94. శతక యజమందు సతతము సాయమిడుచు
సమిధలుగ నిడి పదములన్ శక్తి గూర్చి
శతకమున్ లిఖియించిన సారథీవు
వెంగమాంబకు ప్రాణమా వేంకటేశ!!

95. పద్మనాభ పద్మనయన ప్రణతులివియె
పద్మహస్త సిరినివాస ప్రణతులివియె
పద్మవత్సలా శ్రీధరా ప్రణతులివియె
వెంగమాంబకు ప్రాణమా వేంకటేశ!!

96. హృదయకుహరము నందున హృద్యమైన
శ్రుతిలయ రాగముగ నిల్చి సృష్టి సలిపి
జగములేలెడి శుష్మమా జగపతీవు
వెంగమాంబకు ప్రాణమా వేంకటేశ!!

DRAFT COPY

97. నీదు స్మరణంబు మధురమ్ము నిక్కముగను
నీదు చరితంబు మధురమ్ము నిక్కముగను
నీవు మధురాతి మధురమ్ము నిక్కమిదియె
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

98. విశ్వమంతయు నిలచిన విష్ణువీవు
బ్రహ్మ స్రష్ట సలిపినట్టి బ్రహ్మవీవు
సకల జీవరాశి నిలచు సత్త్వమీవు
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

99. ఎందరో శ్రేష్ఠ భక్తులన్ నీప్సితముగ
హత్తుకొన్నట్టి దివ్యమౌ హాయివీవు
యట్టి హాయి నా కిడువుమా యాదరించి
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

100. వాసుదేవ జలజనేత్ర వైరిహారణ
దేవకీ నందనా శ్రేష్ఠ తీర్థపాద
ఘన కుచేల సంగడికాండ్ర గానలోల
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

101. వివిధ పుష్పముల్ గొనివచ్చి ప్రీతితోడ
శోభ గూర్చెద నిత్యము శుభాముగాను
భూషణప్రియ మాధవా భువనశ్రేష్ఠ
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

102. తులసిదళములు గొని భవ్య తోయమందు
సలిపెదను యర్చనంబులు సంతసమున
పరమ తులసీమది నివాస భవవినాశ
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

103. అలసిసొలసిన వేళ నేనమ్మ నగుచు
పరమ పదసేవ జేయుచు పాడెదనిల
లాలి జగమేలు తండ్రికి లాలియనుచు
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

104. కావు సిరులు శాశ్వతములు కావు యనుచు
కావు బంధములు స్థిరము కావు యనుచు
కాకి జేసెననుదినమ్ము కనులవిప్పి
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

105. మాధవునిగ మము నడుపు మమత నీవు
కృష్ణుడౌ మము బ్రోచెడి కృపవు నీవు
నమ్ము వారికి దుర్గమై నయము గూర్చు
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

DRAFT COPY

106. నిన్ను కీర్తింప నయ్యెద నిపుణమతిని
నిన్ను బూజింప కలుగును నిత్య ముదము
నిన్ను సేవించుటే నాకు నిత్య జయము
వెంగమాంబకు ప్రాణమౌ వేంకటేశ!!

107. శతకమున్ లిఖియింపను సారథివలె
సతము నడుపుచు తగురీతి శక్తినిడిన
సారసాక్షుని పదముల సవినయముగ
యంకిత మిడెద శతకము యనుగు కొలది!!

DRAFT COPY